రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

మహబూబ్‌నగర్, మే 5: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి(45) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ పట్టణంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని తిమ్మసానిపల్లి రైల్వే ట్రాక్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ఒంటిపై బ్లూ కలర్ ఫుల్ షర్ట్, బ్లూ కలర్ లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. చేయి మణికట్టుపై ఎర్రటి దారం ఉంది. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రికి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



నృత్యం చేస్తున్న కళాకారులు



సభలో అభివాదం చేస్తున్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ; చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్

బలహీనవర్గాల హక్కుల కోసమే..

మా పోరాటం

- ఎర్రవల్లి జన జాతర సభలో ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ
- బంగ్లా రాజకీయాలకు గుణపాఠం చెప్పాలి: సీఎం రేవంత్‌రెడ్డి
- పాలమూరుకు కాంగ్రెస్ హయాంలోనే నీటి వనరులు: డిప్యూటీ సీఎం



సభకు వేలాదిగా హాజరైన ప్రజలు

మహబూబ్‌నగర్/గద్వాల/ఎర్రవల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'దేశంలో 26 మంది ధనవంతుల కోసం ప్రధాని నరేంద్ర మోదీ పని చేస్తున్నారు. కానీ, 80 శాతమున్న దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, మైనారిటీల హక్కుల కోసం మేం పోరాడుతున్నాం. దేశంలో బలహీన వర్గాలకు హక్కుగా రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేయాలని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ప్రయత్నిస్తుంటే.. బలహీన వర్గాల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాడుతుంది.' అని ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ మల్లురవి తరఫున జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవెల్లి వద్ద ఆదివారం నిర్వహించిన జన జాతర సభకు రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ దేశంలో విద్వేషాలను పెంచుతూ పదేళ్ల పాలన సాగించారని, కానీ తాను భారత్ జోడో యాత్రతో ప్రేమ దుకాణం తెరిచానని చెప్పారు. దేశంలో అతి పెద్ద సమస్యలైన నిరుద్యోగం, ధరల పెరుగుదలపై మోదీ సర్కార్ మౌనం వహిస్తోందని, కానీ తాము అధికారంలోకి వస్తే దేశంలోని నిరుద్యోగుల కోసం ఉద్యోగ, ఉపాధి కల్పన చేపడతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మహిళలు కుటుంబాన్ని నడపడానికి భారం తగ్గించేందుకు ఏడాదికి రూ.లక్ష ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తామని చెప్పారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.





సభలో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్‌పై కత్తి కట్టిన అరుణ: సీఎం రేవంత్‌రెడ్డి

కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ఉన్న నడిగడ్డ ప్రాంతం పౌరుషానికి ప్రతీక అని, మాట కోసం కట్టుబడి ఉండే నైజమున్నవారని, మాట ఇస్తే తల తెగినా వెనుకాడరని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. నడిగడ్డ రాజకీయాలు, బంగ్లా రాజకీయాలు మీ అందరికీ తెలుసన్నారు. ఉదయం పూట చెరో పార్టీలో ఉండే బంగ్లా నాయకులు, రాత్రికి ఒక్కటై మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఓడగొట్టారని అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ కుమ్మక్కు అయిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఈ ఎన్నికల్లో బంగ్లా రాజకీయాలకు గుణపాఠం చెప్పాలని, డాక్టర్ మల్లు రవిని లక్ష మెజార్టీతో గెలిపించి నడిగడ్డలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. నడిగడ్డలో తుమ్మిళ్ల ప్రాజెక్టు పూర్తికి, ఆర్డీఎస్ పునరుద్ధరణకు బీజేపీ ఎందుకు ప్రయత్నించలేదని నిలదీశారు. ఈ పనులన్నీ పూర్తి కావాలంటే కాంగ్రెస్‌కు అండగా ఉండాలని కోరారు. అరుణమ్మ కాంగ్రెస్‌పై కత్తి కట్టిందని, ఆమెకు పార్టీ ఏం అన్యాయం చేసిందని నిలదీశారు. ఆమెను జడ్పీటీసీగా గెలిపించింది, ఎమ్మెల్యేను చేసింది, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా అవకాశం కల్పించింది కాంగ్రెస్ కాదా? అని ప్రశ్నించారు. బంగ్లాకు కాంగ్రెస్ ఏం తక్కువ చేసిందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. బంగ్లా రాజకీయాలకు స్వస్తిపలికి కాంగ్రెస్‌ని గెలిపిస్తే నడిగడ్డ సమాగ్రాభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తాము ఐదు నెలల్లో ఐదు గ్యారెంటీలు అమలు చేశామని, ఆడబిడ్డలకు రూ.500లకే సిలిండర్ ఇస్తున్నామని, 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల తొమ్మిదిలోగా రైతు భరోసా పూర్తిగా అందజేస్తామని వివరించారు. జోగులాంబ అమ్మవారి సాక్షిగా పంద్రాగస్టులోగా రూ.రెండు లక్షల రుణమాఫీ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. హరీశ్‌రావు రాజీనామాతో సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. కేటీఆర్ చీర కట్టుకొని ఆర్టీసీ బస్సు ఎక్కితే ఆయన్ను టికెట్ అడిగితే తమ గ్యారెంటీలు అమలు కానట్లని, టికెట్ అడగకపోతే అమలవుతున్నట్లని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కారు గ్యారేజీకి మరమ్మతులకు పోలేదని, కారు పని ఖతం అయ్యిందన్నారు. దాన్ని జుమ్మెరాత్ బజార్‌లో తెగనమ్మాల్సిందేనని దుయ్యబట్టారు.

సభ విజయవంతం

జన జాతర సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. సభకు గద్వాల, అలంపూర్, వనపర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల అధిక సంఖ్యలో జన సమీకరణ చేయడంలో నాయకులు సక్సెస్ అయ్యారు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజలు సభకు వచ్చారు. నాయకులు మాట్లాడుతున్నప్పుడు ప్రజలు చప్పట్లు, ఈలలతో మారు మోగించారు. అయితే కిలోమీటరు దూరంలో పోలీసులు వాహనాలను నిలిపేయడంతో సభా ప్రాంగణానికి రావడానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండుటెండలో కాలినడన వచ్చారు. సంపత్ కుమార్ పదే పదే అడిగినా పోలీసులు వాహనాలను అనుమతించ లేదు.

సభ హైలైట్స్

- సీఎం రేవంత్‌రెడ్డి మాట్లడుతూ ఆరు గ్యారెంటీలు అమలు అవుతున్నాయో లేదో తెలుసుకోవడానికి కేటీఆర్ చీర కట్టుకొని బస్సులో అలంపూర్ వరకు ప్రయాణిస్తే తెలుస్తుందని అనడంతో ప్రజలు కేరింతలు, ఈలలతో మారు మ్రోగించారు.
- బీజేపీ ఏం ఇచ్చింది గాడిద గుడ్డు అని గుడ్డు బొమ్మలు చూపించినప్పుడు కూడా ప్రజలు ఈలలు, కేరింతలు కొట్టారు.
- లక్ష మెజారిటీ ఇవ్వాలని అంటే.. ప్రజల ద్వారా పక్కా అనిపించారు.
- రాహుల్ గాంధీ 25 నిమిషాలపాటు ప్రసంగించారు.

రాహుల్‌కు అండగా ఉండాలి : డిప్యూటీ సీఎం భట్టి



పాలమూరుకు పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ ఒక్క చుక్కసాగునీరివ్వలేదని, ఇక్కడున్న నెట్టెంపాడు, కోయిలసాగర్, కల్వకుర్తి, భీమా ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలోనే నిర్మించామని డిప్యూటీ సీఎం మల్లుభట్టివిక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో సంపద, వనరులను బీఆర్‌ఎస్ కొల్లగొట్టిందని దుయ్యబట్టారు. దేశ సంపద, వనరులు దేశ ప్రజలకే దక్కలనే సంకల్పంతో రాహుల్‌గాంధీ ఒంటరి పోరాటం చేస్తున్నారని, ఆయనకు తామంతా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈలోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం నుంచి డాక్టర్ మల్లురవిని భారీ మెజార్టీతో గెలపించాలని విన్నవించారు.

రాహుల్‌ను ప్రధాని చేయాలి: జూపల్లి

త్యాగాలకు మారుపేరుగా ఉన్న సోనియా కుటుంబం ఈ దేశ ప్రజలకు సేవ చేస్తున్నదని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాహుల్ గాంధీ వేల కిలోమీటర్లు పాద యాత్ర చేసి, దేశాన్ని ఏకం చేయాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. రాహుల్‌ను ప్రధాని చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని గుర్తు చేశారు. పాలమూరుకు 55 ఏళ్ల తర్వాత సీఎం అయ్యే అవకాశం రేవంత్‌రెడ్డి ద్వారా వచ్చిందని, ఆయనకు పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు.

అఖండ విజయం అందించాలి: మల్లు రవి

నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుంటే.. రాహుల్ గాంధీ మరో ఐదు గ్యారెంటీలను అమలు చేసేందుకు సిద్ధం అయ్యారని అన్నారు. తెలంగాణ ప్రజలకు 11 గ్యారంటీలు పొందే అవకాశం వచ్చిందని, దీనిని సద్వినియోగం చేసుకుందామని అన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి, అఖండ విజయం అందించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, కశిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ సరిత, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, నాగర్‌కర్నూల్ ఇన్‌చార్జి అనితారెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

- ఆహ్వానించిన నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి



పార్టీలో చేరిన నాయకులతో ఎంపీ అభ్యర్థి మల్లురవి, జడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల/ అయిజ, మే 5 : కాంగ్రెస్ పార్టీలో పలువురు బీఆర్ఎస్ నాయకులు చేరారు. మల్దకల్ మండలం, తాటికుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి, జములమ్మ ఆలయ కమిటీ డైరెక్టర్ కమ్మరి సునీతతో పాటు 60 మంది నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, నాయకులు మధుసూదన్ బాబు, శేషంపల్లి నర్సింహులు, అమరవాయి కృష్ణారెడ్డి, కోటేష్, నర్సింహులు, స్వామినాయుడు, వడ్డె నర్సింహులు, పెద్దొడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంపత్‌కుమార్ సమక్షంలో..

- అయిజ మండల పరిధిలోని మూగోనిపల్లి గ్రామానికి చెందిన చంద్రన్నగౌడు, వేణిసోంపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచు శివతో పాటు పలువురు కార్యకర్తలు ఆదివారం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శాంతినగర్‌లోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో అయిజ మాజీ ఎంపీటీసీ సభ్యుడు మేడికొండ లక్ష్మీకాంతరావు సమక్షంలో వారికి ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



పార్టీలో చేరిన నాయకులతో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

Format C-1

Declaration about criminal cases

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No.536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and address of Candidate : **Dr. Mallu Ravi, H. No. # 8-2-293/82/NL/259, MP's and MLA's Colony, Road No. 10C, Jubilee Hills, Hyderabad, Telangana -500033.**

Name of Political Party : **INDIAN NATIONAL CONGRESS**

*Name of Election : **LOK SABHA, GENERAL ELECTIONS - 2024**

Name of Constituency : **12 - NAGARKURNOOL PARLIAMENTARY CONSTITUENCY**

I, **Dr. MALLU RAVI**, a candidate for the above-mentioned election,declare for public information the following details about my criminal antecedents :

(A) Pending Criminal Cases

Sl. No.	Name of Court	Case No. and Dated	Status of Case(s)	Section(s) of Acts concerned and brief description of offence(s)
1	JFCM Court, Mahabubnagar	Cr. No. 268/2011	Pending	U/s. 143, 353, 379, 332, 323, 324, 224, 506, 427, 153-A of IPC r/w. Sec.149 IPC and Sec.3 of PDPP Act.
2	JFCM Court, Mahabubnagar	CC No.340 of 2018	Pending	U/s. 332 r/w. 34 IPC
3	Add. MM-cum-AJCJ Courts, Rangareddy	CC No. 3671/2022,	Pending	U/s.147, 148, 332, 188, r/w 149 IPC, 7 CLA-1952
4	1-Spl. JFCM for Excise Cases	CC No. 470/2023	Pending	U/s. 143,147, 341, 290, r/w 149 IPC
5	MP/MLA Court	CC No. 43/2024	Pending	U/s 143,145, 147 r/w 149, 120b, 341,336, 427, 435, 152, 153, 353, 506 of IPC & Sec.3 of PDPP Act

(B) Details about cases of conviction for criminal offences

Sl. No.	Name of the Court & date(s) of order(s)	Description of offence(s) & punishment Imposed	Maximum punishment Imposed
1	JFCM Court, Jadcherla	On 07.07.2001 in view of the visit of Y.S.Rajashekar Reddy, CLP leader at Nethaji Junction, Badepally, the police person Jadcherla were on Bandobash duty, while lit of crackers by party persons the SI obstructed them. At that I interfered in this matter to obstruct the SI in discharging his duties and also argued to continue illegal acts against the permission according to conduct the meeting.	I was admonished the punished awarded for the offence after giving warning U/s. 360(i) of CRPC and directed to execute a bond u/s. 360(I) CRPC to maintain good behavior in the public for a period of one year and not to repeat such offence and I was released U/s. 3 & 4 of probation of offenders Act.

పాలమూరుకు సీఎం రేవంత్ చేసిందేమీ లేదు

- బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



మిడ్జిల్‌లో మాట్లాడుతున్న డీకే అరుణ

మిడ్జిల్/రాజాపూర్, మే 5: తెలంగాణకు మోదీ ఏం చేశాడని ప్రశ్నిస్తున్న రేవంత్‌రెడ్డి సీఎంగా ఈ ప్రాంతానికి చేసేంది గాడిద గుడ్డని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ మండిపడ్డారు. ఆదివారం ఆమె మిడ్జిల్ మండలంలోని మిడ్జిల్, దోనూర్, జడ్చర్ల మండలం గంగాపూర్, జడ్చర్ల పట్టణం, రాజాపూర్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా చోట్ల మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రధానిపై విమర్శలు చేస్తూనే ఆడ బిడ్డ అని కూడా చూడకుండా తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నాడని, ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. మోదీపై విమర్శలు చేసే హక్కు రేవంత్‌రెడ్డికి లేదన్నారు. పాలమూరు అభివృద్ధి చెందాలంటే మరోసారి మోదీ ప్రధాని కావాలని, ఇక్కడ మీ ఆడబిడ్డ ఎంపీగా గెలవాలన్నారు. ఆరు గ్యారెంటీలంటూ కాంగ్రెస్ నాయకులు ప్రజలను ఆగం చేశారన్నారు. 60 ఏళ్లలో కాంగ్రెస్ చేయలేని పనులను మోదీ పదేళ్లలో చేసి చూపించారన్నారు. నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్‌కు ప్రజలందరూ ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఆయా గ్రామాల్లోని పలు పార్టీలకు చెందిన నాయకులు అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయా గ్రామాల్లో అరుణకు ఘన స్వాగతం పలికారు. జడ్చర్లలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మిడ్జిల్ వైస్ ఎంపీపీ తిరుపతమ్మ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బాల్రాతిపుర సుందరి, మండల ఇన్‌చార్జి ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మండల అధ్యక్షుడు కావలి నరేందర్, జడ్చర్ల పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీరెడ్డి పాల్గొన్నారు.

8న కల్వకుర్తికి కేటీఆర్ రాక

- హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, మే 5 : బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 8న కల్వకుర్తికి రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ తెలిపారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా నిర్వహించే ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారని తెలిపారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలో కేటీఆర్ పర్యటన పురస్కరించుకుని హెలీ ప్యాడ్ స్థలాన్ని మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంతో కలిసి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీ తో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 8న కల్వకుర్తి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగే సభకు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ కొండూరు గోవర్ధన్, బీఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు సింగం విజయ్ గౌడ్, నాయకులు మనోహర్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెలకపల్లి, మే 5 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతిఇ చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ బి.నరేష్ అందించిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన మోతల బాలస్వామి(60) శనివారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై తెలకపల్లి నుండి పెద్దపల్లికి వెళ్తుండగా గౌరెడ్డిపల్లి గ్రామ చౌరస్తా దగ్గర లింగాల మండలం వల్లభాపూర్ గ్రామానికి చెందిన అఖిల్ తన ద్విచక్ర వాహనంతో ఢీ కొట్టడంతో బాలస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ బి.నరేష్ తెలిపారు. మృతుడి తమ్ముడి కొడుకు మోతల మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డుపై సంత..ట్రాఫిక్‌తో చింత

- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- ఏళ్లు గడుస్తున్నా మారని తీరు
- శంకుస్థాపనకే పరిమితమైన నూతన మార్కెట్ నిర్మాణ పనులు


భూత్పూర్ రహదారిపై సంత జరుగుతుండటంతో ట్రాఫిక్ జామ్

భూత్పూర్, మే 5 : భూత్పూర్ సంత ఏర్పడి దాదాపు 25 ఏళ్లవుతోంది. ప్రతీ ఆదివారం జోరుగా సాగే సంతకు దాదాపుగా 20 నుంచి 30గ్రామాల ప్రజలు వస్తుంటారు. సంతలో వ్యాపారాలు అన్నీ రహదారిపైనే కొనసాగుతుండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంతలో కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలు, ఇతర వ్యాపారాలు జోరుగా సాగుతాయి. చాలా మంది రైతులు వారు పండించిన కూరగాయలను తెచ్చుకొని ఇక్కడ అమ్ముకుంటారు. చౌరస్తా కూడలి దగ్గర సర్వీస్ రోడ్లపైన, గ్రీనరీ ప్రదేశాల్లో సంత సాగుతోంది. నాగకర్నూల్, కర్నూల్, మహబూబ్‌నగర్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లే వాహనాలు, ప్రయాణికులకు ఆదివారం సాయంత్రం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అప్పుడప్పుడు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. గ్రామ పంచాయతీగా ఉన్న భూత్పూర్ పట్టణం ఏడేళ్ల క్రితం మునిసిపాలిటీగా మారింది. గతేడాది క్రితం నూతన మార్కెట్ ఏర్పాటు కోసం స్థలాన్ని కేటాయిస్తూ భూత్పూర్ సమీపంలో రూ 1.50 కోట్లతో వ్యయంతో అధికారులు ఆగమేఘాల మీద శంకుస్థాపనలు చేశారు. అది కాస్త మధ్యలోనే ఆగిపోయింది. రోడ్లకు ఇరు వైపులా దారి పొడవునా సంత దుకాణాలు ఉండడంతో రాకపోకలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నటుగా వాహనదారులు, ప్రాయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు స్పందించి ఆగిపోయిన మార్కెట్ షెడ్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని స్థానికులు, వ్యాపారస్థులు కోరుతున్నారు.

రోడ్ల మీదనే మాంసం, చేపల విక్రయాలు

సంత రోజు రోడ్ల మీదనే మాంసం, చేపల విక్రయాలు జరుగుతుడడంతో ప్రజలకు, వాహనదారులకు, ఇతరులకు అనేక ఇబ్బందును ఎదుర్కొటున్నారు. ముఖ్యంగా నాగకర్నూల్ రోడ్డుకు ఇరు వైపులా మాంసం అమ్మకాలు ప్రతీ ఆదివారం జోరుగా జరుగుతాయి. కొనుగోలుదారులు తెచ్చుకొనే వాహనాలను రోడ్లపై నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


భూత్పూర్ రోడ్డు పై వాహనాలు ఆపి మాంసం కొంటున్న వినియోగదారులు


పిల్లర్లకే పరిమితమైన కూరగాయలు, మాంసం విక్రయ మార్కెట్

ప్రత్యేక స్థలం కేటాయిస్తే బాగుంటది



నేను చాలా రోజుల నుంచి ఇక్కడ కూరగాయల వ్యాపారం చేస్తున్నాను. రోడ్డు పక్కల సర్వీస్ రోడ్డు మీదనే వ్యాపారం నడుస్తుంది. వాహనాలు వస్తుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయం ఉంటుంది. ప్రత్యేక స్థలం కేటాయించి అక్కడే వ్యాపారాలు నడిచేవిధంగా అధికారులు చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

- అంజమ్మ, కూరగాయల వ్యాపారస్థురాలు

వ్యాపారాలకు ఇబ్బంది



లక్షలు ఖర్చు పెట్టి వ్యాపారాలు చేస్తున్నాం. కిరాయిలు కట్టలేక పోతున్నాం. సర్వీస్ రోడ్డు చుట్టూరా చిన్న చిన్న వ్యాపారస్థులు మా వ్యాపార సముదాయాల కు అడ్డం అవుతున్నారు. వాళ్లకు ప్రత్యేక స్థలం కేటాయిస్తే బాగుంటుంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. చాలా సార్లు మునిసిపాలిటీ అధికారులకు చెప్పినం. ఎవరూ పట్టించుకోవడం లేదు.

- గోపాలకృష్ణ, కిరాణ వ్యాపారస్థుడు

అద్దె చెల్లించడం కష్టం అవుతుంది



నేను చాలా ఏండ్లు నుంచి కిరాణ వ్యాపారం చేస్తున్నాను. రోజు రోజుకు అద్దె పెరిగిపోతుంది. మాకు వ్యాపారం సరిగా కావడం లేదు. మా వ్యాపార సముదాయలకు అడ్డంగా కొందరు చిన్న వ్యాపారస్థులు దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వారికి ప్రత్యేక స్థలం కేటాయించారని విన్నాము. అక్కడ నిర్మిస్తున్న వ్యాపార సముదాయాల షెడ్డు అసంపూర్తిగా ఉంది. దాన్ని త్వరితగతిన పూర్తి చేస్తే ఇన్ని ఇబ్బందులు ఉండవు.

- శ్రీరాములు, వ్యాపారస్థుడు

ప్రతీ ఒక్కరు ఓటు హక్కు
వినియోగించుకోవాలి

- మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మహబూబ్‌నగర్ టౌన్, మే 5 : ఈ నెల 13న మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజక వర్గానికి జరగనున్న ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు స్వీప్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతి, కుల మతం తేడా వయోబేధం లేకుండా అన్ని వర్గాల వారు ఓటింగ్‌లో తప్పక పాల్గొనాలని ఓటర్లచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న నిర్వహించేబోయే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని, 18 సంవత్సరాలు దాటిన ప్రతీ ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తీవ్రమైన ఎండను దృష్టిలో ఉంచుకొని ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.



స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

రాష్ట్ర ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలు చేపడుతోందని, ఒక్క ఓటు కూడా వ్యర్థం కాకుండా అన్ని వర్గాల వారు ఓటింగ్‌లో పాల్గొలని కోరారు. కార్యక్రమంలో కళాజాత బృందం గీతాలు ఆకట్టుకున్నాయి, ట్రాన్స్‌జెండర్లు తమ వంతు పాత్రగా ర్యాలీలో చురుకుగా పాల్గొని నినాదాలిచ్చారు. ఎన్‌సీసీ బృందం కవాతుగా ర్యాలీలో పాల్గొని, నినాదాలిచ్చారు. ఎన్నికల పర్వం దేశానికి గర్వం, ఓటు హక్కు ప్రజల హక్కు, ఓటేసే బాధ్యత మనందరి బాధ్యత, బుల్లెట్‌కన్నా, బ్యాలెట్ మిన్న వంటి నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. స్వీప్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎన్నికల సిబ్బంది, మెప్మా మహిళా సిబ్బంది, కళాజాత బృందం, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఐసీడీఎస్ మహిళా కార్యకర్తలు, సమ్మర్ క్యాంపు విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, ట్రాన్స్ జెండర్లు పాల్గొన్నారు.

ఎస్ఐ జైలుకు పంపుతానని బెదిరిస్తున్నారు

- ట్రాక్టర్ యజమాని మల్లయ్య ఆవేదన
- వాట్సాప్ గ్రూపుల్లో వీడియో వైరల్

మహమ్మదాబాద్, మే 5 : డయల్ 100కు కాల్ చేస్తే ఎస్ఐ శేఖర్‌రెడ్డి జైలుకు పంపుతానని బెదిరిస్తున్నారని ట్రాక్టర్ యజమాని మల్లయ్య వాట్సాప్‌లో చేసిన వీడియోలు మండలంలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మహమ్మదాబాద్ మండలం ధర్మపూర్, అన్నరెడ్డిపల్లి గ్రామాల్లో ఇసుక దందా జోరుగా సాగుతోంది. దీంట్లో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు బలంగానే వినిపిస్తున్నాయి. రంగారెడ్డిపల్లికి చెందిన ట్రాక్టర్ యజమాని మలయ్య ఇసుక దందా చేస్తున్నారు. శనివారం రాత్రి ఇసుక ట్రాక్టర్లు నడుస్తున్నాయని శ్రీనివాస్‌రెడ్డితో డయల్ 100కు ఫోన్ చేయించినందుకు తనను జైలుకు పంపిస్తానని బెదిరిస్తున్నారని గండీడ్, మహమ్మదాబాద్‌కు చెందిన వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయడంతో పాటు రంగారెడ్డిపల్లి గేట్ దగ్గర పెట్రోల్ పోసుకొని తగులపెట్టుకుంటామని ఆడియోలో పేర్కొనడంతో ఉమ్మడి మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' ట్రాక్టర్ యజమాని మల్లయ్యను ఆదివారం ఫోన్ ద్వారా సంప్రదించగా ఇసుక రవాణా చేసేందుకు మండలంలోని నలుగురు నాయకులతో పాటు పోలీసులకు ప్రతీ ట్రాక్టర్‌కు రూ.2,500 చెల్లిస్తున్నట్లు తెలిపారు. అయినా ఎస్ఐ తనను ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ నీ మీద కేసు పెట్టి జైలు పంపిస్తానని బెదిరిస్తున్నాడని అందుకే ఆత్మహత్య చేసుకుంటానని ఆడియో తీసినట్లు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ శేఖర్‌రెడ్డిని వివరణ కోరగా తాను ఎవరిని బెదిరించలేదని, వాట్సప్‌లో వచ్చిన ఆడియోలు విన్నాను.. ఆ వ్యక్తిపై కేసులు కూడా ఉన్నాయి. డయల్ 100 శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తితో ఫోన్ చేయించి ఇసుక నడుస్తుందని తప్పుడు సమాచారం ఇచ్చి తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పుకొచ్చారు.

నిరుపయోగంగా ప్రయాణప్రాంగణాలు

- రోడ్లపై ప్రయాణికుల ఇబ్బందులు

వెల్దండ, మే 5 : మండలంలోని పలు గ్రామాల్లో ప్రయాణ ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరగా, మరికొన్ని గ్రామాల్లో కనీసం ప్రయాణికులు నిలబడేందుకు సైతం ఎటువంటి షెల్టర్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ఎండకు, వానలకు రోడ్లపైనే నిలబడి బస్సుల కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపులేనితనంతో ఈ పరిస్థితి నెలకొందన్న విమర్శలు ఉన్నాయి. హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారికి అనుసరించుకుని ఉన్న వెల్దండలో సుమారు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం నిరుపయోగంగా మారింది. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ బస్టాండు ఆవరణలో ప్రయాణికుల అవసరాలను గుర్తించి అప్పట్లో మరుగుదొడ్లు సైతం నిర్మించారు. కాగా బస్సులు రావడానికి సరిపడా ఆవరణ లేదన్న సాకుతో ఏ ఒక్కనాడు సైతం ప్రాంగణంలోకి ఆర్టీసీ బస్సు రాలేదు. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ బస్టాండు నిరుపయోగంగా మారడంతో ప్రజాధనం వృధా అయ్యిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వివిధ గ్రామాల నుంచిప్రతినిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు ఇక్కడి నుంచి వెళుతుంటారు. కనీసం బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లను పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అంతేగాక మండల పరిధిలోని కొత్రతండా, చెర్కూర్, పెద్దాపూర్, నారాయణపూర్, రాఘాయిపల్లి గ్రామాల నుంచి వెళ్లే ప్రయాణికులకు బస్ షెల్టర్లు నిర్మించాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా మారిన వెల్దండ ప్రయాణ ప్రాంగణం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకుల మృతి


బాలపీరు


నగేష్

పెద్దకొత్తపల్లి/తెలకపల్లి, మే 5 : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలు ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని దేవుని తిర్మలాపూర్ శివారులో ఒకరు, తెలకపల్లి మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి గ్రామ శివారులోని మరొకరు మృతి చెందారు. పెద్దకొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామానికి చెందిన మెరుగలి బాలపీరు(30) అనే యువకుడు తన మోటారు సైకిల్‌పై పెద్దకొత్తపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా గ్రామ శివారులో గుర్తు తెలి యని వాహనం ఢీకొట్టింది. దీంతో బాలపీరు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి భార్య మెరుగలి మహేశ్వరి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. అలాగే తెలకపల్లి ఎస్‌ఐ బి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తెలకపల్లి మండల పరిధిలోని పెద్దూరు గ్రామానికి చెందిన కోలా నగేష్(30) ఆదివారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై తెలకపల్లికి వెళ్తుండగా గౌరెడ్డిపల్లి గ్రామ శివారులో కారు ఢీకొన్నది. నగేష్‌కు రక్తగాయాలు కాగా వెంటనే గమనించిన స్థానికులు నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. నగేష్ చిన్నాన్న బిచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

వాహనంపై నుంచి కింద పడి డ్రైవర్ మృతి

ఉప్పునుంతల, మే 5: ప్రమాదవశాత్తు వాహనంపై నుంచి కింద పడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకోంది. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈర్వటోనిపల్లి గ్రామానికి చెందిన సభావట్ గణేష్ (27) లారీ నడుపుతూ జీవనం సాగించేవాడు. అదే క్రమంలో వెల్టూరు గ్రామానికి చెందిన గంట రాములు ఎద్దులను సంతకు తీసుకెళ్లేందుకు కిరాయి వెళ్లారు. వాహనంపైకి ఎద్దులను ఎక్కిస్తుండగా క్యాబిన్‌పై నుంచి ఎద్దు తాడు లాగుతుండగా తాడు తెగి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. గణేష్‌కు తలకు మెడకు రక్తగాయాలయ్యాయి. విషయాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు తెలియజేసి అచ్చంపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో గణేష్ మృతి చెందాడు. మృతుడి భార్య గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఇరువురి మధ్య ఘర్షణ

- ఒకరికి గాయాలు - కేసు నమోదు

అలంపూర్ చౌరస్తా, మే 5: మద్యం తాగేందుకు వెళ్లిన నలుగురు మిత్రులలో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకోగా, ఒకరికి గాయాలైన సంఘటన గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని కంచుపాడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాల శివశంకర్, ఎరుకలి రాజేష్, మరో ఇద్దరు మిత్రులతో కలిసి మద్యం తాగేందుకు పొలాల్లోకి వెళ్లారు. శివశంకర్, రాజేష్‌ల మధ్య మాట మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. దాంతో రాజేష్ శివశంకర్‌ను రాయితో కొట్టడంతో తలకు గాయమైంది. శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

రేవల్లి, మే 5: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి ఎస్సై తిరుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చెలికేశ్వరం గంగపురి (62) హైదరాబాదులో కూలి పని చేస్తూ భార్యా పిల్లలతో కలిసి జీవనం సాగించేవాడు. గంగపురి మద్యానికి బానిస కావడంతో భార్య, పిల్లలు తిట్టారు. దాంతో ఆవేశంగా గురువారం హైదరాబాద్ నుంచి రేవల్లికి వచ్చాడు. గంగాపురి మందుతాగి తన సొంత పొలంలో గల మోదుగ చెట్టుకు చీరతో ఉరి వేసుకున్నాడు. ఆదివారం ఉదయం అటుగా వెళ్తున్న గ్రామస్థులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని దించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గంగపురి కొడుకు బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇతనికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

నల్ల మట్టి లారీని పట్టుకున్న పోలీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


నల్ల మట్టిని తరలిస్తున్న లారీ

గోపాల్‌పేట, మే5: అక్రమంగా చెరువు లో నుంచి నల్లమట్టి తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకెళ్తే శనివారం రాత్రి 11.30కి సమయంలో మండల కేంద్రంలోని తత్వ చెరువు నుంచి ఓ ఇటుక బట్టి దళారి ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులో నుంచి నల్లమట్టిని ఎత్తుకెళ్తున్నారు. ఈ విషయం 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం ప్రచురణమైంది. శనివారం రోజు రాత్రి సమయంలో మండల కేంద్రం చెందిన ఓ ఇటిక బట్టిల దళారి ఎలాంటి అనుమతులు లేకుండా ఆరు టిప్పర్లతో అక్రమంగా మట్టిని తరలిస్తుండగా స్థానిక రైతులు తహసీల్దార్ శ్రీనివాసులు మృతు సంపద శాఖ ఏఈ వెంకటేష్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. స్పందించిన అధికారులు పోలీసుల సాయంతో లారీని పట్టుకున్నారు.

కృష్ణానది తీరాన వలస పక్షుల సందడి

- గ్రేటర్ ఫ్లెమింగో పక్షులుగా గుర్తించిన అటవీ శాఖ అధికారులు


మంచాలకట్ట సమీపంలో కృష్ణానది తీరాన గ్రేటర్ ఫ్లెమింగో పక్షుల సందడి

కొల్లాపూర్, మే 5 : వేసవిలో కృష్ణానది తీరాన వలస పక్షుల సందడిని తిలకించేందుకు ఈ ప్రాంత ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట సమీపంలో కృష్ణానది తీరాన వలస పక్షులైన గ్రేటర్ ఫ్లెమింగోళ్లను అటవీ శాఖ అధికారులు ఆదివారం గుర్తించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో తొలిసారి గ్రేటర్ ఫ్లెమింగో పక్షులు సంచరిస్తున్నట్లు గుర్తించామని ఫారెస్టు రేంజర్ శరత్‌చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఇవి ఎక్కువగా కొల్లేటి సరస్సులో సంచరిస్తుంటాయని తెలంగాణలో ఆదిలాబాద్, మంజీరాలో కన్పిస్తుంటాయని తొలిసారి కృష్ణానది తీరాన తాము గుర్తించామని రేంజర్ శరత్‌చంద్రారెడ్డి తెలిపారు. పెంట్లవెల్లి మండలం వేంకల్ ప్రాంతంలో ఉన్న హైటెన్షన్ ఎలక్ట్రికల్ వైరును తగిలి గ్రేటర్ ఫ్లెమింగో పక్షులు మృత్యువాత పడుతున్నాయని ఆయన తెలిపారు. మృత్యువాత పడిన పక్షులను ఫారెస్టు రేంజర్ శరత్ చంద్రారెడ్డి, అటవీ శాఖ అధికారులు పరిశీలించారు.


హైటెన్షన్ వైర్లకు తగిలి మృతి చెందిన గ్రేటర్ ఫ్లెమింగో పక్షిని పరిశీలిస్తున్న ఫారెస్టు రేంజర్ శరత్‌చంద్రారెడ్డి

పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రం 'సీ విజిల్'

- సీవిజిల్ యాప్‌తో ఎన్నికల్లో అక్రమాలకు చెక్
- ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ప్రతీ పౌరుడు ఫిర్యాదు చేసే అవకాశం
- 100 నిమిషాల్లో అధికారుల నుంచి ప్రతిస్పందన

ఖిల్లాఘనపురం, మే 5: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న బాధ్యతగల పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రంగా సీవిజిల్ యాప్ మారింది. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడే నాయకులకు చెక్ పెడుతూ అడ్డుకట్ట వేస్తున్నారు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన ఎన్నికల వ్యయ ఉల్లంఘన జరిగే అక్రమాలపై యాప్ అమల్లోకి రావడంతో రాజకీయ పార్టీల నాయకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎన్నికల కోడ్ ఉల్లంఘన పై స్మార్ట్ ఫోన్ కలిగిన ప్రతీ పౌరుడు సి విజిల్ యాప్ ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఈ యాప్ ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అనుసంధానం చేయబడి ఉంటుంది. ఎన్నికల నియమాలను ఎవరైనా ఉల్లంఘించిన మద్యం, మాదకద్రవ్యాలు, నగదు పంపిణీ చేసిన, మారణాయుధాలు కలిగి ఉన్నా, ఓటర్లను ప్రలోభ పెట్టు వస్తువులు పంపిణీ, కుల మతద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు, ఓటర్లను బెదిరించుట, అసత్య వార్తలను ప్రసాదం చేయుట, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయుట లాంటివి సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. మొబైల్ ఫోన్లో ఫొటోలు, వీడియా తీసి యాప్‌లో అప్లోడ్ చేస్తే సంబంధిత అధికారులు ఫిర్యాదు పై వంద నిమిషాల్లో ప్రతిస్పందించి తగిన చర్యలు తీసుకుంటారు.

సీవిజిల్ యాప్‌ని వినియోగించడం ఎలా?

స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి సీవిజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. భాషను ఎంపిక చేసుకుని టిక్ మార్క్ చేస్తే ఫోన్ స్క్రీన్‌పై యాప్‌లోగో కనిపిస్తుంది. అనంతరం సెల్ నెంబర్‌కు కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఆఫ్ ఇండియా నుంచి ఎస్ఎంఎస్ ద్వారా నాలుగు అంకెలతో కూడిన నెంబర్ వస్తుంది. దాన్ని ఎంటర్ చేసిన అనంతరం వినియోగదారుడికి సంబంధించిన పూర్తి వివరాలు పొందుపరచాలి. ఎన్నికలకు సంబంధించి ఏమైనా అక్రమాలు మీ పరిసరాల్లో జరిగిన దృష్టికి వచ్చిన సీవిజిల్ ఫోన్ యాప్‌ను ఓపెన్ చేసి ఫొటో, వీడియో తీసి అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో ఫోన్‌లో జీపీఎస్ ఆన్ చేసి ఉండాలి. ఫిర్యాదు చేసిన 15 నిమిషాల్లో ఎన్నికల ఫీల్డ్‌టీం అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపడతారు. ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో ప్రతీ స్పందన ఎన్నికల ప్రవర్తన నియమావళిలో ఉల్లంఘన అక్రమాలు జరిగితే సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు అందిన వెంటనే జిల్లా ఎన్నికల అధికార ఐదు నిమిషాల వ్యవధిలో వెరిఫికేషన్ కోసం ఫీల్డ్ యూనిట్‌కి ఫిర్యాదును పంపిస్తారు. 15 నిమిషాల వ్యవధిలో ఫిర్యాదు చేసిన సంఘటన స్థలానికి ఫీల్డ్ టీం చేరుకుంటుంది 30 నిమిషాల వ్యవధిలో ఎన్నికల నియమావళిలో జరిగిన ఉల్లంఘనపై నివేదికను సిద్ధం చేస్తారు. 50 నిమిషాల వ్యవధిలో రిటర్నింగ్ అధికారి ఫిర్యాదును ముగించడానికి చర్యలు చేపట్టి ఫిర్యాదుకు 100 నిమిషాల్లో ప్రతిస్పందన ఉండేలా ఎన్నికల అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకుంటారు.



సీవిజిల్ యాప్

ప్రతీ పౌరుడు యాప్ వినియోగించుకోవాలి



సీవిజిల్ యాప్ ద్వారా భారత ఎన్నికల సంఘానికి ప్రతీ పౌరుడు నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఎన్నికల నియమావళి ఉల్లంఘన అక్రమాలకు సంబంధించిన ఫొటో లేదా రెండు నిమిషాల వ్యవధి గల వీడియోను యాప్‌ద్వారా అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేయాలి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వనపర్తి నియోకవర్గంలో సీవిజిల్ యాప్ ద్వారా 13 ఫిర్యాదులు వచ్చాయి.

- పాండు, తహసీల్దార్ , ఖిల్లాఘణపురం

ఎంపీ ఎన్నికలను బహిష్కరిస్తాం

- ఎదిర నాలుగవ వార్డు ప్రజల స్వచ్ఛంద తీర్మానం
- కంపెనీ ఎత్తివేసే వరకు పోరాటం
- అమర్‌రాజా బ్యాటరీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎదిర గ్రామపెద్దలు

మహబూబ్‌నగర్ అర్బన్, మే 5: రాబోయే మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికను బహిష్కరిస్తున్నామని అమర్‌రాజా బ్యాటరీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు స్పష్టం చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని ఎదిర నాలుగవ వార్డులో విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎదిర నాలుగవ వార్డు కౌన్సిలర్ యాదమ్మ, మాజీ కౌన్సిలర్ శివశంకర్, మాజీ సర్పంచ్ శ్రీనాథ్‌శర్మ, సుధా నర్సింహులు, పోరాట సమితి సభ్యులు మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా రాబోయే మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో ఓటు వేయకూడదని తీర్మానం చేసినట్లు వెల్లడించారు. 51 రోజులుగా అమర్‌రాజా కంపెనీకి వ్యతిరేకంగా దీక్షలు చేపడుతున్నామన్నారు. గతంలో రాజ్‌వీర్ కలర్ డయింగ్ ప్లాంట్ నుంచి భూమి, నీరు, గాలి కాలుష్యాపై 20 సంవత్సరాలుగా అనర్థాలకు గురయ్యామని తెలిపారు. మళ్లీ అమర్‌రాజా బ్యాటరీ పరిశ్రమ ప్రారంభమయితే ఊరు వదిలి వెళ్లిపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు ఐటీ ఏర్పాటు చేస్తామంటే యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని స్వాగతించమన్నారు. కాలుష్యాన్ని వెదజల్లే అమరరాజా బ్యాటరీ కంపెనీ మాత్రం మాకొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దాని స్థానంలో మరో కంపెనీ పెట్టాలని కోరారు. కంపెనీ ఎత్తివేసే వరకు నిరాహార దీక్షలు కొనసాగుతాయని వెల్లడించారు. భవిష్యత్తులో ఉద్యమాన్ని మరితం ఉధృతం చేస్తామన్నారు. సమస్య తీరే వరకు పోరాటం ఆగదని వెల్లడించారు. సమావేశంలో పెద్ద హన్మంతు, ఎల్.రాములు, జి.రాములు, జంగయ్య, కోట్లవెంకటయ్య, అబ్దుల్‌హకీం, అల్లీ ఎల్లయ్య, అల్లీశేఖర్, కృష్ణ, సత్యం, అమర్‌నాథ్‌రెడ్డి, బానుచందర్, నవకాంత్‌రెడ్డి, అజీజుల్లా, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు, అశోక్, శివకుమార్, ఆంజనేయులు, నరసింహ పాల్గొన్నారు.

రూ. ఏడు లక్షల నగదు పట్టివేత


పట్టుబడిన నగదుతో పోలీసులు

బాలానగర్, మే 5: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని పెద్దరేవల్లి గ్రామానికి చెందిన మణికంఠగౌడ్ వద్ద రూ. ఏడు లక్షల నగదు గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగదును గ్రీవెన్స్ సెల్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తిరుపాజి తెలిపారు. ధ్రువపత్రాలను చూపించి నగదును తీసుకెళ్లాలని ఎస్సై సూచించారు.

మస్తీపూర్ గ్రామ శివారు ..

అమరచింత : మండల పరిధిలోని మస్తీపూర్ గ్రామ శివారు వద్ద ఓ వ్యక్తి వద్ద రూ.52వేలు ఆదివారం రాత్రి ఎస్‌ఐ సురేష్ పట్టుకుని సీజ్ చేశారు. అమరచింత నుంచి మస్తీపూర్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మల్లేష్ అనే వ్యక్తిని తనిఖీ చేయగా రూ.52 వేలు గుర్తించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డబ్బును పోలీసులు స్వాధీనపరుచుకున్నారు.

మద్యం పట్టివేత

బాలానగర్: బాలానగర్ మండలం కుమ్మరికుంట తండాకు చెందిన ఇస్లావత్ లక్ష్మణ్ తండాలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. లక్ష్మణ్ వద్ద ఏడు లీటర్ల మద్యం లభించింది. కేసు నమేదు చేసినట్లు ఎస్సై తిరుపాజి తెలిపారు.

కొనసాగుతున్న సాగునీటి కాల్వ పనులు


ఆగారం కాల్వ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు మున్నూరు జయాకర్

ఖిల్లాఘణపురం, మే5: వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని ఆగారం గ్రామానికి సాగు నీటి కోసం కాల్వ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. వెంకటంపల్లి గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన చెక్ డ్యామ్ ద్వారా ఆగారం గ్రామం రెడ్లచెరువుకు సాగునీరు అందించడానికి పైపులు అమర్చి కాల్వ నిర్మాణ పనులు చేపట్టడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 22 ఏళ్ల క్రితం వాగుద్వారా సాగునీరు వచ్చేదని గ్రామస్థులు గుర్తు చేశారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి చొరవతో కాల్వ పనులు వేగవంతంగా చేస్తున్నారు. ఆదివారం కాంగ్రెస్ నాయకులు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు మున్నూరు జయాకర్ మాట్లాడుతూ కాల్వ నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని గుత్తేదారును కోరారు. రాబోయే వర్షాకాలంలో వానలు సమృద్ధిగా కురిస్తే రెడ్ల చెరువుకు సాగు నీరు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాల్వ నిర్మాణానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు గ్రామస్థుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కృష్ణయ్య, సాగర్, బీరయ్య ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- గురువులకు సన్మానం - విద్యానిధికి రూ. 1,90,000 జమ


ఒకే వేదికపై కలిసిన పూర్వ విద్యార్థులు

పీపనగండ్ల, మే 5 : వనపర్తి జిల్లా పీపనగండ్ల మండల పరిధిలోని తూముకుంట జడ్పీహెచ్ పాఠశాలలో 1991-92 విద్యా సంవత్సరం పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులందరు ఒకే వేదికపై కలిసి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మరణించిన ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులకు శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పిల్లల విద్యా వికాసానికి విద్యా నిధిని ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. మొదటగా తలకంటి నారాయణరెడ్డి తన వంతుగా రూ. 10వేల ఆర్థిక సాయం ప్రకటించగా విద్యార్థులందరూ. రూ. లక్షా 90వేల విద్యా నిధికి జమ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సునంద, శ్రీదేవి, పూర్వ విద్యార్థులు తదితరులున్నారు.

మైసమ్మను దర్శించుకున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, మే 5 : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తుల కొంగుబంగారంగా వెలసిన మైసమ్మ దేవతను భక్తులు దర్శనం చేసుకున్నారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం దాదాపు 10వేల మంది భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల నుంచి ఈ ఆదివారం హుండీ ద్వారా ఒక లక్ష 24వేలు, టికెట్ల ద్వారా 56వేలు మొత్తం ఒక లక్ష 80వేల ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎంపీగా గెలవాలని బీఆర్ఎస్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల మండల ఇన్‌చార్జి నెల్మూరి శేఖర్ ఆధ్వర్యంలో మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

భానుడి భగభగ

- గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత
- అక్కడక్కడ కురిసిన వర్షం



వటువర్లపల్లిలో కురిసిన వర్షం

మహబూబ్‌నగర్/ నారాయణపేట/ దోమలపెంట/గద్వాల/వనపర్తి అర్బన్/ నాగర్‌కర్నూల్ టౌన్/హన్వాడ/మిడ్జిల్, మే 5 : పాలమూరులో ఎండలు దంచికొడుతున్నాయి. వరుసగా రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. గత మూడ్రోజులతో పోలిస్తే ఆదివారం కాస్త ఎండల తీవ్రత తగ్గింది. ఉక్కపోత, వడగాలులు ఏ మాత్రం తగ్గలేదు. సాయంత్రానికి కాస్త మోడం పడినా, గాలులు వీడడంతో వడగాలుల తీవ్రత కొంత తగ్గింది. అక్కడక్కడ జల్లులు పడ్డాయి.

నల్లమల అటవీ ప్రాంతంలో ఆదివారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వటువర్లపల్లి, కుడిచింతలబావి, సార్లపల్లి, మల్లెలతీర్థం గ్రామాల సరిసర అటవీ ప్రాంతంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతావరణం కొంత చల్లబడింది. అలాగే మహబూబ్ నగర్ జిల్లా హన్వాడలో ఆదివారం సాయంత్రం వీచిన గాలులకు చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్‌కు అంతరాయం కలిగింది. నర్సరీల్లో మొక్కలకు వేసిన నీడ టెంట్లు కూలి పోయాయి. హన్వాడ, నాయినోనిపల్లి, ఇబ్రహీంబా ద్, బుద్దారం గ్రామాల్లో వర్షం పడింది. అలాగే మిడ్జిల్ మండలంలోని మున్ననూర్, వాడియాలలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి వరి, మొక్కజొన్న ధాన్యం తడిసి ముద్దైంది. పంటకోసి నూర్పిల్లు చేపట్టి ఆరబెట్టిన ధాన్యం తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు.

- జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 45.9, ధరూర్‌లో 45.7, ఇటిక్యాలలో 45.5, గద్వాలలో 44.8, అలంపూర్‌లో 44.7, ఉండవెల్లిలో 44.6, కేటీదొడ్డిలో 44.5, అయిజలో 44.4, మల్దకల్‌లో 43.7, రాజోలిలో 43.7, మానవపాడులో 43.4, గట్టులో 43.4 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- వనపర్తి జిల్లా శ్రీ రంగ పూర్‌లో 45.7, డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అమరచింత 45.1, పాన్‌గల్ 44.7, గోపాల్‌పేట, మదనాపూర్ 44.6, ఘనపూర్ 44.4, చిన్నంబావి, 44.1 కొత్తకోట, పెబ్బేరు, పెద్దమందడి 43.1, పీపనగండ్ల 42.9 ఉష్ణోగ్రత నమోదైంది.
- నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలో 45.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. బిజినేపల్లిలో 44.9, చారకొండలో 44.8, ఉప్పునుంతలలో 44.6, పెద్దకొత్తపల్లిలో 44.6, కోడేరులో 44.5, నాగర్‌కర్నూల్‌లో 44.3, కొల్లాపూర్‌లో 44.0, అచ్చంపేటలో 43.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- మహబూబ్‌నగర్ జిల్లా సీసీకుంటలో 44.4, మిడ్జిల్‌లో 44.3, బాలానగర్‌లో 44, కోయిల్‌కొండ, మూసాపేటలలో 43.7. అడ్డాకులలో 43.5 డిగ్రీలు నమోదైంది.
- నారాయణపేట జిల్లా మక్తల్, నర్వలో 43 డిగ్రీలు, కోస్గి మండలంలో 42 డిగ్రీలు, కృష్ణలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.


నాయినోనిపల్లి నర్సరీలో కూలిన షెడ్లు


మున్ననూర్ గ్రామ శివారులోని తడిసిన మొక్కజొన్నను కుప్పగా పోసుకుంటున్న రైతులు

సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, మే 5: మహిళల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మహిళా సమ్మేళనానికి ఏఐసీసీ పరిశీలకుడు పీవీ మోహన్, పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి సతీమణి రాజభాస్సిదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవడానికి ఇదే సరైన సమయమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మేనిఫెస్టోలో మహిళలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో హక్కులను రిజర్వేషన్లను కల్పించిన ఘనత ఇందిరా గాంధీదన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవిని అత్యధిక మోజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనఅందరిపైన ఉందన్నారు. అచ్చంపేట ఎన్నికల ఇన్‌చార్జి రాములు యాదవ్, జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, కాంగ్రెస్ నాయకురాలు సునీత, శారదమ్మ, సశీల తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

తాడూరు, మే 5 : మండలంలోని యువజన క్రీడా వారి ఆధ్వర్యంలో వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. మేడిపూర్ గ్రామంలో వాలీబాల్ వేసవి ఉచిత శిక్షణ శిబిరానికి విచ్చేసిన ఎడ్ల శ్రీను, బుద్దారం అంజి, మెంట లింగంలు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని శిక్షణ శిబిరానికి యువతకు క్రీడల గురించి వివరించారు. క్రీడాకారులకు కావాల్సిన చిన్నచిన్న వసతులకు సహకారం ఉంటుందని తెలియజేశారు. గ్రామంలోని యువకుల యొక్క క్రీడను వెలికితీయాలని సూచించారు. పీఈటీ చింతపల్లి కుర్మయ్య, ఎడ్ల శ్రీను, బుద్దారం అంజి, మెంట లింగం, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర నాయకుడు బృంగి ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, మే 5 : కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కల్వకుర్తి పట్టణంలో ఆదివారం మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు రావుల శ్రీనివాస్, మాలమహానాడు మహిళా సంఘం నాయకురాలు మణెమ్మ, తిరుపతమ్మ, నాయకులు నాగరాజులు కాంగ్రెస్ పార్టీలో బృంగి ఆనంద్‌కుమార్ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, చెన్నకేశవులు, సుభానీ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే దేశ భవిష్యత్తు

- బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



మాధారంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

ఊర్కొండ, మే 5: మోదీతోనే దేశ భవిష్యత్తు సాధ్యమని మహబూబ్‌నగర్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. ఆదివారం మండలంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ముందుగా ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊర్కొండపేట, ముచ్చర్లపల్లి, తిమ్మన్నపల్లి, రేవల్లి, మాధారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో భారతదేశం ప్రధాని మోదీ నాయకత్వంలో అనేక పథకాలను అమలు చేశామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను తమ పథకాలుగా గతంలో ఉన్న తెలంగాణ ప్రభుత్వం చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. దేశంలో అరాచకాలు, దౌర్జన్యాలు రూపుమాపాలంటే బీజేపీని గెలిపించాలని ఆమె పేర్కొన్నారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి, పరుశరాములు, రాజేందర్‌గౌడ్, వెంకటేష్, దిఆవాకర్‌గౌడ్, సందీప్ తదితరులు ఉన్నారు.

'బీఆర్‌ఎస్‌తోనే సబ్బండ వర్గాలకు న్యాయం'

కల్వకుర్తి, మే 5 : బీఆర్‌ఎస్‌తోనే సబ్బండ వర్గాలకు సమన్యాయం జరుగుతుందని కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కల్వకుర్తి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ 21వ వార్డులో ఆదివారం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా స్థానిక నాయకులతో కలిసి చైర్మన్ సత్యం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైస్ చైర్మన్ షాహేద్, కౌన్సిలర్ సైదులుగౌడ్, మునిసిపల్ స్పెషల్ నాలెడ్జ్ పర్సన్ మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మధు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్

» ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,786 మంది హాజరు



సమర్థ పాఠశాల పరీక్ష కేంద్ర నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 5 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11 కేంద్రాలలో నిర్వహించిన నీట్ ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు సంబంధించి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచే అనుమతించారు.

పరీక్ష హాల్‌లోకి వెళ్లేలా పిల్లలను క్షుణ్ణంగా పరిశీలించారు. నీట్ పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4920 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 4786 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. కాగా పరీక్షలో కొన్ని ప్రశ్నలు లెంతీగా ఉన్నాయని విద్యార్థులు చెబుతున్నారు.

ఈ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలి

కల్వకుర్తి/అచ్చంపేటటౌన్/కొల్లాపూర్, మే 5: నాగర్‌కర్నూల్ గడ్డపై బీజేపీ జెండాను ఎగురవేయా లని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్.సంతోష్, కేంద్ర మంత్రి మురుగన్‌లు కోరారు. కల్వకుర్తి పట్టణం లోని ఓ ఫంక్షన్ హాల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరి ధిలోని శక్తి కేంద్ర ఇన్‌చార్జిల సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశానికి వారితో పాటు నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఎల్.సంతోష్, మురుగన్‌లు మాట్లాడారు. బీజేపీ జాతీయ నాయకురాలు బంగారు శ్రుతి, ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, జక్కరఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆయుర్వేదిక్ కళాశాల ఏర్పాటుకు కృషి

నల్లమల ఎన్నో ఔషధాల మొక్కలు ఉన్నాయని, గతంలో నాగర్ కర్నూల్ ఎంపీ రాములు ప్రధానమంత్రి మోదీకి ఆయుర్వేదిక్ కళాశాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపారని మూడవసారి మోదీ ప్రధాని అయిన వెంటనే ఆయుర్వేదిక్ కళాశాల ఏర్పాటు కోసం కృషి చేస్తారని కేంద్ర పశుసంవర్ధక, సమాచార శాఖ మంత్రి మురుగన్ అన్నారు. ఆదివారం అచ్చంపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన గిరిజన ఆత్మీయ సమ్మేళనానికి నాగర్‌కర్నూల్ ఎంపీ రాములుతో పాటు ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ ఎంపీగా భరత్ ప్రసాద్‌ను గెలుపించాలన్నారు.

కొల్లాపూర్‌కు జాతీయ రహదారి, కృష్ణానదిపై ఐకానిక్ వంతెన..

కల్వకుర్తి నుంచి కర్నూల వరకు 167కె జాతీయ రహదారి నిర్మాణంతో పాటు సో మశిల కృష్ణానదిపై అతి పెద్ద ఐకానిక్ వంతెన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వంలోనే మంజూరై జాతీ య రహదారి పనులు కూడా కొనసాగుతున్నాయని కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి మురుగన్ పేర్కొన్నారు. ఆదివారం కొల్లాపూర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ని యోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కేంద్ర స మాచార ప్రసార శాఖ స హాయ మంత్రి మురుగన్ స మావేశమయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావుతో కలిసి కేంద్ర సహాయ మంత్రి మురుగన్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ అసెంబ్లీ ప్ర భారీ అశోక్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శేఖర్ గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్, అసెంబ్లీ కో కన్వీనర్ అన్వేష్, బీజేపీ రాష్ట్ర సమితి సభ్యులు కేతూరి నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు సందు ర మేష్, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రోజారమ ణి, బీజేపీ మండల అధ్యక్షు డు తమటం సాయికృష్ణగౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్.సంతోష్

ఈ జీవితం ప్రజలకే అంకితం: ఎంపీ

● 30సంవత్సరాల రాజకీయ జీవితం ప్రజలకే అంకితం చేశానని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు అన్నారు. అచ్చంపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

● తెలకపల్లి: భారతదేశం అభివృద్ధి పథంలో ప్రయాణించాలంటే నరేంద్రమోదీ మరోసారి ప్రధానమంత్రి కావాలని ఎంపీ, బీజేపీ నాయకుడు పోతుగంటి రాములు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కార్వంగలో విస్తృతంగా ప్రచారం చేశారు.

గ్యారెంటీ పథకాలు అమలు చేస్తాం

-ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తిమ్మాజీపేట, మే 5 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ మల్లురవిని ఆశీర్వదించి గెలిపించాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. తిమ్మాజీపేట మండల పరిధిలోని మరికల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య సామెల్ ఏర్పాటు చేసుకున్న కట్టెల కోత మిషన్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కాసేపు కార్యకర్తలతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం తిమ్మాజీపేటలో నిర్వహించే సభకు సంబంధించిన వివరాలను నాయకుల ద్వారా తెలుసుకున్నారు. ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ద్వారానే జరుగుతుందని, పార్టీకి ఓటు వేసి డాక్టర్ మల్లురవిని అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం సమావేశానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌బహదూర్, దానం బాలరాజు, వెంకట్రామిరెడ్డి, మాధవులు, ఉస్మాన్, రవూఫ్, లక్ష్మీనారాయణ, దేవస్వామి, లింగం, ఎస్.మనోహర్, నాగసాయిలు, వరుణ్‌కుమార్, మల్లేష్‌ముదిరాజ్, వెంకటయ్య, రాఘవేందర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలి

బిజినేపల్లి: పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి మల్లు రవి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి కోరారు. మండలంలోని పాలెంలోని బాలాజీ గార్డెన్‌లో ఆదివారం ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డితో కలిసి మండల కాంగ్రెస్ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో పాటు కొత్తగా ప్రకటించిన మరో ఐదు గ్యారెంటీ పథకాలను వివరించి కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం ముమ్మరం చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాల ఫలాలు అందాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండాలని అన్నారు. జడ్పీటీసీ సభ్యుడు తూం హరిచరణ్ రెడ్డి, మల్లు రవి కూతురు శ్రుతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కొండ నాగేష్, మండల అధ్యక్షుడు మిద్దె రాములు, మండల నాయకులు అమృత్ రెడ్డి, వెంకటస్వామి, మాన్యనాయక్, కర్నాటి తిరుపతయ్య, చికొండ్ర తిరుపతయ్య, రవీందర్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి కృష్ణాజీ, కత్తె ఈశ్వర్, నసీర్, వెంకటేష్ గౌడ్, అజీజ్ తదితరులు ఉన్నారు.



పాలెంలో కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మాదిగలకు ఒక్క ఎంపీ స్థానం ఇవ్వని కాంగ్రెస్‌ను ఓడించాలి

అచ్చంపేటటౌన్, మే 5: మాదిగలకు ఒక్క ఎంపీ స్థానం ఇవ్వని కాంగ్రెస్‌ను ఓడించాలని బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బీజేపీకి ఓటు వేస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందని.. ఈ రెండు పార్టీలను ఓడించి తెలంగాణ ఆత్మగౌరవం నిలబెట్టిన బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలన్నారు. అచ్చంపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మాదిగల ఆత్మగౌరవ సభకు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో మూడు ఎస్సీ పార్లమెంట్ స్థానాల్లో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్క ఎంపీ సీటు ఇవ్వకుండా కాంగ్రెస్ రాజకీయంగా తీరని అన్యాయం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాదిగల ఓట్లు అడిగే నైతికత లేదన్నారు. ఎంపీ రాములు తన కుమారుని రాజకీయ భవిష్యత్తు కోసం బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన ఉద్యమ ద్రోహి అని మాజీ ఎమ్మెల్యే గువ్వల అన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గెలుపుకోసం ప్రతీ ఒక్కరు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలన్నారు. నాయకులు విజయ్, కాశన్న, గోవర్ధన్, ప్రదీప్, వెంకటయ్య, తర్ని కంటి పర్వతాలు, మల్లేష్, ఉప్పరి బాలరాజు, అంజీ తదితరులు పాల్గొన్నారు.

మీ బిడ్డగా ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా

● ఉప్పునుంతల: తెలంగాణ అభివృద్ధి కోసం నితం పరితపించిన పార్టీకి ఓటు వేసి గెలుపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉప్పునుంతల మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి పాల్గొన్నారు.

నాయకులు నవీన్ కుమార్ రెడ్డి, రవీంద్రరావు, భూపాల్ రావు, గోపాల్ రెడ్డి, భాస్కర్, జంగయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాంగ్రెస్‌తోనే నిరుపేదల అభివృద్ధి

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, మే 5 : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కేవలం కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చెర్కూర్, నారాయణపూర్ గ్రామాలలో పార్లమెంటు అభ్యర్థి మల్లురవికి మద్దతుగా నారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి పార్టీ చేపడుతున్న పథకాలను వివరించారు.

ఎన్నికలకుముందు ఇచ్చిన హామీలను క్రమంగా నెరవేరుస్తున్నామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. వచ్చే ఆగస్టు 15 నాటికి రైతు రుణమాఫీ చేస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నామన్నారు.

దేశంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, రాహుల్‌గాంధీ ప్రధానిని చేయడమే లక్ష్యమన్నారు. మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని నారాయణరెడ్డి కోరారు. వైస్‌ఎంపీపీ శాంతి, నాయకులు భూపతిరెడ్డి, మోతీలాల్, కృష్ణ, పర్వత్‌రెడ్డి, పత్యానాయక్, పుల్లయ్య, ఎర్రశ్రీను ఉన్నారు.



చెర్కూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీజేపీ

బుక్‌లెట్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ

కందనూలు, మే 5 : అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీజేపీ అనే బుక్‌లెట్‌ను ఆదివారం ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి ఏఐటీయూసీ నాయకులతో కలిసి తన స్వగృహంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన మోదీ సర్కార్ ఉద్యోగాల భర్తీ ఏమైందని ప్రశ్నించారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చి జన్‌ధన్ ఖాతాలో ఒక్కొక్కరికి రూ.15 లక్షల చొప్పున వేస్తామని చెప్పిన మోదీ సర్కార్ నల్లధనం ఎటు పోయిందో ఇంత వరకు జాడ తెలియ లేదన్నారు. అదేవిధంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ మాట్లాడుతూ వంద సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక సంక్షేమ చట్టాలను తొలగించి వాటి స్థానంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికుల భవిష్యత్తు అంధకారం చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తు పోరాటానికై మే డే స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడానికి కావాల్సిన పోరాట రూపకల్పన చేసుకోవాలన్నారు. దేశంలో ఇండియా కూటమిని బలపర్చాలని కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ఈ సందర్భంగా కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివ శంకర్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నపాగ శ్రీనివాసులు, ఆలేరు గ్రామ కాంగ్రెస్ ఎంపీటీసీ జింకల ఈశ్వరయ్య, ఏఐటీయూసీ హమాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేశమోని అంజనేయులు, నాయకులు డి.రాములు తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు

వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కొత్త రామ్మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు

కోడేరు, మే 5 : మండల కేంద్రం ఆదివారం మాజీ ఎంపీపీ కొత్తరామ్మోహన్ రావు సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మహేందర్, బక్క బాలయ్య, చెన్నయ్య, వెంకటస్వామి, మల్లయ్య, కుమ్మరి వెంకటస్వామి తదితరులు ఉన్నారు. మండల సీనియర్ నాయకులు రంగినేని జగదీశ్వర్‌రావు, కోఆప్షన్ మెంబరు అబ్దుల్ కరీం, చలపతిరావు, మాజీ వార్డు మెంబరు ఆదిరాజు, మిద్దెరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

మన్ననూర్, మే 5: అచ్చంపేట పట్టణంలోని లోటస్ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించే ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రీజినల్ చైర్మన్ జూలూరి సత్యనారాయణ, ఆర్యవైశ్య ఆఫీసర్స్ ప్రొఫెషనల్ అసోసియేషన్ కార్యదర్శి సంబు వెంకట్ రమణలు తెలిపారు. మన్ననూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసులు

తెలకపల్లి, మే 5 : మండల కేంద్రంలో చైతన్యభారతి పాఠశాలలో ఆదివారం భారత కమ్యూనిస్టు పార్టీ మండల జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వ పదేండ్ల మోదీ పాలన ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని మతం పేరుతో ప్రజల మధ్యన విభజన సృష్టిస్తూ మతోన్మాద రాజకీయాలు చేస్తుందన్నారు. మండల కార్యదర్శి నందిపేట భాస్కర్, సీనియర్ నాయకులు విజయ్‌గౌడ్, పార్టీ సభ్యులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాచూరులో క్రికెట్ పోటీలు ప్రారంభం

వెల్దండ, మే 5 : మండల పరిధిలోని రాచూరు గ్రామంలో ఆదివారం రాచూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను నిర్వాహకులు గోకమళ్ల రాజు ప్రారంభించారు. గ్రామీణస్థాయిలో క్రీడాకారులలోని ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపకరిస్తాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. రమేష్, ప్రశాంత్, రాజు, శ్రవన్ తదితరులు ఉన్నారు.

'ఆ పార్టీలకు గుణపాఠం చెప్పాలి'

వంగూరు మే 5: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు అన్నారు. ఆదివారం వంగూరులో పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఉన్న ప్రతిపక్షపార్టీలను భయభ్రాంతులకు గురిచేసి ఈడీ, సీబీఐ సంస్థలను ఉపయోగించుకొని మోదీ జైళ్లకు పంపిస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. బాలస్వామి, అంజనేయులు, శివరాములు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిద్దాం



బీజేపీ బందీఖానా నుంచి దేశాన్ని విముక్తి చేద్దామనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పర్వతాలు

కల్వకుర్తి, మే 5 : పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి లబ్ధి పొందాలని చూస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు పిలుపునిచ్చారు. కల్వకుర్తి పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ముద్రించిన బీజేపీ బందీఖానా నుంచి దేశాన్ని విముక్తి చేద్దామనే పుస్తకాన్ని మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌తో కలిసి వారు ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు అంజనేయులు, ఏపీ మల్లయ్య, చిలుక బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, జగన్, వెంకటయ్య, లక్‌పతినాయక్ తదితరులు ఉన్నారు.

వర్గరహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

కల్వకుర్తి, మే 5 : వర్గరహిత దోపిడీ లేని సమసమాజ స్థాపన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎంప్లాయిస్ వాయిస్ పత్రిక ఎడిటర్ వెంకటేశ్వర్లు కోరారు. కల్వకుర్తి పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో కారల్‌మార్క్స్ 206 జయంతిని ఆదివారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, నాయకులు అంజనేయులు, ఏపీ మల్లయ్య బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, జగన్, వెంకటయ్య, లక్‌పతినాయక్ తదితరులు ఉన్నారు.

మల్లు రవి గెలుపు కోసం ఇంటింటి ప్రచారం

చారకొండ, మే 5: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఆదివారం మండలంలోని మర్రిపల్లిలో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి గెలుపుకోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీలను ఇంటింటికి తిరిగి ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండల్, ఉపాధ్యక్షుడు నూనే విష్ణు, ద్యాప కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ అంగోత్ రాజునాయక్, గ్రామ కమిటీ యూత్ అధ్యక్షుడు నూనే రాజు, ఉపాధ్యక్షుడు అంగోత్ లాలునాయక్, సోసల్ మీడియా ఇంచార్జీ నూనే బాలకృష్ణ, కాగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



చెన్నారం గ్రామంలో త్రైత భగవద్గీత ప్రచారం చేస్తున్న నిర్వాహకులు

బల్మూరు, మే 5 : మండలంలోని చెన్నారం గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక అచ్చంపేట కమిటీ, నాగర్‌కర్నూల్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిశంకర్, హిస్టరీ మనోహర్ మాట్లాడుతూ త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంతంతో ప్రబోధన సమితి సభ్యులు నిరంజన్, సుధాకర్, తిరుపతి, నరసింహ, రమాదేవి, స్వప్న, మంజుల, శిరీష, కావేరి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలకు ఆర్ఎస్‌పీ క్షమాపణ చెప్పాలి'

తిమ్మాజిపేట, మే 5 : కూచకుళ్ల రాజేష్‌రెడ్డి నకిలీ ఎమ్మెల్యే అంటూ.. మర్రి జనార్దన్‌రెడ్డి మీ ఎమ్మెల్యే అంటూ ఓటు వేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజల్ని అవమానపర్చే రీతిన మాట్లాడిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ క్షమాపణ చెప్పాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌బహదూర్ డిమాండ్ చేశారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తిమ్మాజిపేటలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన రోడ్‌షోలో ఆయన మాట్లాడిన తీరుపై మండిపడ్డారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దానం బాలరాజు, మాధవులు, ఉస్మాన్, రవూఫ్, లక్ష్మీనారాయణ, లింగం, ఎస్.మనోహర్, మల్లేష్‌ముదిరాజ్, రాఘవేందర్, వరుణ్‌కుమార్, జంగయ్య, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.